
సాక్షి ఒడిశా

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5,70,681
బంగారం : 4 గ్రాముల 670 మిల్లీ గ్రాములు
వెండి : 18 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/ పూరీ



ఉపాధ్యాయులకు సత్కారం

మల్కన్‌గిరి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో టీచర్స్ డే నిర్వహించారు. టీచర్లను సత్కరించారు.

- 8లో



బై బై గణేశా

వినాయక నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. భారీగా అనుపు ఉత్సవాలు నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

గవర్నర్‌ను కలిసిన వైమానిక కమాండింగ్-ఇన్-చీఫ్



భారత వైమానిక దళం తూర్పు వైమానిక కమాండ్, ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్, ఎయిర్ మార్షల్ సూరత్ సింగ్ శనివారం రాజ్ భవన్‌లో గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటిని కలిశారు. రక్షణ సన్నద్ధతకు సంబంధించిన అంశాలు మరియు పరస్పర ఆసక్తి ఉన్న విషయాలపై వీరిపురు చర్చించారు. – భువనేశ్వర్

రాష్ట్రంలో పురోగతి సాధించిన విద్యా సంస్థలు



ఒడిశా వ్యవసాయ, సాంకేతిక విశ్వ విద్యాలయం ఓయూఏటీ

భువనేశ్వర్: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) ర్యాంకింగ్స్‌లో ఒడిశాలోని కొన్ని ప్రముఖ విద్యాసంస్థలు గణనీయమైన పురోగతి సాధించాయి. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో స్థానిక ఒడిశా వ్యవసాయ, సాంకేతిక విశ్వ విద్యాలయం ఓయూఏటీ ఎన్‌ఐఆర్‌ఎఫ్ - 2025లో 19వ స్థానంలో నిలిచింది. మేనేజ్‌మెంట్ విద్యను అందించే 100 ఉత్తమ సంస్థలలో ఐఐఎం సంబల్‌పూర్ 34వ స్థానం సాధించగా స్థానిక ఉత్కళ విశ్వవిద్యాలయం రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వర్గం కింద 48వ స్థానం సాధించింది. జాతీయ స్థాయిలో తొలి 100 ఉన్నత విశ్వవిద్యాలయాలలో స్థానిక శిక్ష్యా ఓ అనుసంధాన్ (ఎస్‌ఓఏ) డీమ్డ్ టు బి యూనివర్సిటీ 15వ, కిట్ 17వ స్థానాల్లో నిలిచాయి. రౌర్కెలా ఎన్‌ఐటీ - 34, భువనేశ్వర్ ఐఐటీ - 80, భువనేశ్వర్ ఎయిమ్స్ 100వ స్థానం సాధించాయి.

మహానది ట్రిబ్యునల్ విచారణ

భువనేశ్వర్: జస్టిస్ బేలా ఎం. త్రివేది అధ్యక్షతన మహానది జల వివాదాల ట్రిబ్యునల్ శనివారం విచారణ ప్రారంభించింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ 2 రాష్ట్రాల మధ్య దీర్ఘ కాలంగా కొనసాగుతున్న మహానది జలాల పంపిణీ వివాదం కొత్త దశలోకి ప్రవేశించింది. విచారణ పురస్కరించుకుని రెండు రాష్ట్రాలు జలాల పంపిణీ వివాదం సమస్యను సహకార స్ఫూర్తితో సామరస్యంగా పరిష్కరించుకోవడానికి తమ సన్నద్ధతను ట్రిబ్యునల్ సమక్షంలో వ్యక్తీకరించడం విశేషం. ఒడిశా తరఫున వాదించిన అడ్వకేట్ జనరల్ పీతాంబర్ ఆచార్య ఈ ఏడాది ఆగస్టు నెలలో రెండు రాష్ట్రాల అధికారుల మధ్య పలు సమావేశాలు జరిగాయని ట్రిబ్యునల్‌కు తెలియజేశారు. ఈ సమావేశాల్లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల జల వనరుల శాఖ కార్యదర్శులు, ప్రభుత్వాల ప్రముఖ కార్యదర్శుల మధ్య చర్చలు చోటు చేసుకున్నట్లు వివరించారు. సయోధ్య కోసం నిరంతర ప్రయత్నాలను ప్రతిబింబిస్తూ అక్టోబర్ నెలలో మరో ఉన్నత స్థాయి సమావేశం జరగనుందని పీతాంబర ఆచార్య పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ జల వనరుల శాఖ కార్యదర్శి కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. అంతర్ రాష్ట్ర సంభాషణల ద్వారా సానుకూల పురోగతి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా మహా నది సమస్యపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో చర్చించి అత్యున్నత స్థాయిలో సామరస్య పరిష్కారానికి ప్రతిపాదించినట్లు రాష్ట్ర అడ్వకేటు జనరల్ పీతాంబర ఆచార్య వెల్లడించారు.

రెండు రాష్ట్రాలు తమ ప్రజల ప్రయోజనాల కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడానికి సన్నద్ధతను వ్యక్తం చేశాయి. దీర్ఘకాల పోరు నుంచి సహకార స్ఫూర్తితో సామరస్య పరిష్కారానికి మొగ్గు చూపడం శుభ సంకేతంగా పేర్కొన్నారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు, కేంద్ర జల సంఘం మార్గదర్శకత్వంలో ఉమ్మడి సాంకేతిక కమిటీని ఏర్పాటు ప్రతిపాదన విషయాల్ని ఇరు రాష్ట్రాల ప్రతినిధులు ట్రిబ్యునల్‌కు వివరించారు. సామరస్య పరిష్కారం యోచన ఫలప్రదమైతే మహానది నదీ వ్యవస్థపై ఆధారపడిన లక్షలాది మందిని ప్రభావితం చేస్తుంది. ఈ దిశలో ఆశాజనకమైన మలుపును ఆవిష్కరిస్తుంది.

వేధిస్తున్న ఎరువుల కొరత



ఎరువుల కోసం పడిగాపులు



కాశీపూర్‌లో ఎరువుల గోదాంపై దాడులు నిర్వహించిన అధికారులు



ఎరువుల కోసం ఇతర వస్తువులు అంటగడుతున్నారని చూపిస్తున్న రైతులు

రాయగడ: వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తున్నామంటూ ప్రకటనలు గుప్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు ఆచరణలో చేసి చూపించడం లేదు. జిల్లాలో ఎరువుల కొరత తీవ్రరూపం దాల్చుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎరువుల కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఒక వైపు ఉభాలు పూర్తి చేసి ఎరువులు వేసే సమయానికి ఎరువులు సకాలంలో అందకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ డీలర్లు తమ వద్దకు వచ్చిన రైతులను నిలువునా దోచేస్తున్నారు. ఎరువుల బస్తాతో మరి కొన్ని రసాయనాలను అంటగడుతున్నారు. ఇవి తీసుకుంటేనే ఎరువుల బస్తా ఇస్తామంటూ తెగేసి చెబుతున్నారు. దీంతో గత్యంతరం లేక రైతులు ఎరువుల కోసం అనవసరంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కోసం 14050 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా ఇప్పటికి కేవలం 6 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే సరఫరా అయ్యాయి. దీంతో ఎరువుల కొరత తీవ్రమైంది. రైతులకు సకాలంలో అందకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. రైతుకు సంబంధించిన ఆధార్ కార్డుకు కేవలం ఒకే ఎరువుల బస్తాను మంజూరు చేస్తున్నారు. ధర కూడా పెంచి అమ్ముతున్నారు.

నామమాత్రపు దాడులు

జిల్లాలో ఇటీవల బిసంకటక్ సమితి పరిధిలో గల వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు ప్రైవేట్ ఎరువుల గోదాముల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. అధిక ధరలకు ఎరువులను రైతులకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై ఈ మేరకు అధికారులు దాడులను నిర్వహించి కొందరు డీలర్లకు షోకాజ్ నోటీసులను కూడా జారీ చేశారు. తాజాగా శనివారం జిల్లాలోని కాశీపూర్‌లో అధికారులు ఎరువుల గోదాముల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. అయితే జిల్లా కేంద్రంలో మాత్రం ఇంతవరకు ఎరువుల గోదాముల్లో అధికారులు ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రాయగడలో ఆదర్శ గ్రామాల గుర్తింపు



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖలకు చెందిన అధికారులు



ప్రసంగిస్తున్న అక్షయ ఖెముండో పక్కనే మాఝి

రాయగడ: జిల్లాలోని 42 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా గుర్తించి వాటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టిందని జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెమండో అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వికసిత్ భారత్ పథకంలో భాగంగా ఈ గ్రామాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక డీఆర్‌డీఏ సమావేశ హాల్‌లో శనివారం నిర్వహించిన ఆది కర్మయోగి శిక్షణ శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో దాదాపు 56 శాతం మంది కొండకోనల్లో, అత్యంత వెనుక బడిన ప్రాంతాల్లో నివసిస్తున్నారని వారికి విద్య, వైద్యం వంటి మౌలిక సౌకర్యాలను కల్పించి ఆయా గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఆదర్శ గ్రామాలుగా గుర్తించిన 42 గ్రామాల నుంచి 20 మంది సభ్యులను ఎంపికచేయాలని అన్నారు. ఇందులో సర్పంచులు, సమితి సభ్యులు, యువకులు, స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు ఉండాలని సూచించారు. ఇలా ఎంపిక చేసిన సభ్యులను ఆది కర్మయోగులుగా గుర్తించాలని వివరించారు. ఈ ఎంపిక ప్రక్రియ ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. అనంతరం కార్యచరణ ప్రణాళికను రూపొందించి దానికి అనుగుణంగా చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని కలెక్టర్‌కు నివేదించాలన్నారు.

ఉత్సాహంగా జాతీయ పోషకాహార వారోత్సవాలు



జాతీయ న్యూట్రిషన్ డే సందర్భంగా హెల్త్ చెకప్ కార్యక్రమంలో సెంచూరియన్ విద్యార్థినులు



చేతులు ఎలా శుభ్రంగా కడుక్కోవాలో నేర్పిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు



దవిడిగాంలో సీనియర్ సిటిజన్స్‌కు కళ్ల పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్లు

పర్లాకిమిడి: జాతీయ పోషకాహార వారోత్సవాలను సెంచూరియన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ఈ నెల 1 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించారు. గుసాని సమితిలో ధవిడిగాం, రణదేవి, కంట్రగడ, ఏడో మైలు, ఆర్.సీతాపురం, దాలింబాపూర్ గ్రామాల్లో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, జీవన శైలి పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ధవిడిగాంలో సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనిత పాత్రో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రధాన కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.ఎన్ సంధ్య సామాన్యుల ఆరోగ్యాన్ని కాపాడటంలో పోషకాహారాల ప్రాముఖ్యతను వివరించారు. దంతవైద్య నిపుణులు సల్లాన శరత్ కుమార్ అనేక మందికి దంతాలను పరీక్షించి మందులు రాసిచ్చారు. నేత్ర పరీక్షలు కూడా చేశారు.

ఒడియాలో నేమ్ బోర్డులు తప్పనిసరి



నేమ్ బోర్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యాపార సంస్థల నేమ్ బోర్డులను ఒడియాలో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్న నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ యంత్రాంగం ఉత్తర్వులను జారీ చేసింది. అయితే నియమాలను పట్టించుకోని వ్యాపార సంస్థలపై అధికారులు కొరడా ఝులిపించారు. ఈ మేరకు శనివారం రాయగడ పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో మున్సిపాలిటీ సిబ్బంది తనిఖీలను నిర్వహించారు. ఇంగ్లిష్‌లో సైన్ బోర్డులను ఏర్పాటు చేసిన వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 30వ తేదీలోగా వ్యాపార సంస్థలు యజమానులు వారి వ్యాపారాలకు సంబంధించిన నేమ్ బోర్డులను ఒడియాలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే రోజుకు 500 రూపాయలు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. ఒడియాలో నేమ్ బోర్డులను ఏర్పాటు చేసినంత వరకు ఈ ప్రక్రియ వర్తిస్తోందని నోటీసులో స్పష్టం చేశారు. ఉత్తర్వులకు అనుగుణంగా స్పందించిన వ్యాపారస్తులకు లైసెన్స్ రెన్యువల్ సమయంలో 50 శాతం రుసుంలో సబ్సిడీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

రైతులకు పవర్ టిల్లర్లు అందజేత



పవర్ టిల్లర్లు అందుకున్న రైతులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వభీమాన్ ఎరియా బోడపోడ పంచాయతీలో రైతులకు పవర్ టిల్లర్లను శుక్రవారం పంపిణీ చేశారు. బోడపోడ ల్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం తరఫున ఆరుగురు రైతులకు వీటిని సమకూర్చారు. రానున్న రోజుల్లో మరి కొంతమంది రైతులకు వీటిని అందజేస్తామని కూడుములగుమ్మ ల్యాంప్ అధ్యక్షుడు గోపీ పంగి తెలిపారు. పెప్పరమేట్ల పంచాయతీకి చెందిన మదన్ ఖేముడు, తుంబనాథ్ ఖీలో, తైల తలాబ్, కామటి సిందేరీ, లక్ష్మణ ఖరా, హర ఖేముడుకు వీటిని అందించారు.

దిదాయ్ బాలికకు గవర్నర్ సత్కారం



చంపా రస్పెదాకు గవర్నర్ సత్కారం



చంపా రస్పెదాతో గవర్నర్ హరిబాబు

భువనేశ్వర్: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)లో అర్హత సాధించిన తొలి దుర్బల గిరిజన సమూహం (పీవీటీజీ) దిదాయ్ వర్గం అమ్మాయి చంపా రస్పెడను రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి శనివారం రాజ్ భవన్‌లో సత్కరించారు. మల్కన్‌గిరి జిల్లాలోని అమ్లిబేడ గ్రామానికి చెందిన చంపా, నీట్‌కు అర్హత సాధించి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశం పొందిన మొట్టమొదటి దిదాయ్ అమ్మాయిగా చరిత్ర సృష్టించింది. ఆమె తన సోదరుడు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్సీ ఎస్టీ ఆర్టీఐ) అధికారి, ఆమె గురువు, ఉపాధ్యాయులు ఉత్కళ కేశరి దాస్‌తో కలిసి రాజ్ భవన్‌ను సందర్శించింది. ఆమెతో సంభాషణ సమయంలో గవర్నర్ ఆమె ఎదుర్కొన్న సవాళ్లు, పాఠశాల విద్య, శిక్షణ మద్దతు, వైద్య వృత్తిని కొనసాగించాలనే సంకల్పం వంటి కోణాల్లో ఆమె ప్రయాణం గురించి అడిగి తెలుసుకున్నారు. చంపా సాధించిన విజయాన్ని డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రశంసిస్తూ ఆమె విజయం దిదాయ్ సమాజానికే కాకుండా సమగ్ర రాష్ట్రానికే గర్వకారణమన్నారు. మారుమూల గ్రామం నుంచి నీట్ పరీక్షకు అర్హత సాధించడానికి ఆమె ప్రయాణం అసాధారణమైన సంకల్పం, పట్టుదల, విద్య పట్ల బలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. చంపా ఉత్తీర్ణత గిరిజన, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు శక్తివంతమైన ప్రేరణగా అడ్డంకులను అధిగమించడానికి దోహదపడి జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి వారిని ప్రేరేపిస్తుందన్నారు. చంపా రస్పెదా భావి విద్యా కార్యకలాపాలలో సాధ్యమైన అన్ని మద్దతులను అందజేస్తానని గవర్నర్ హామీ ఇచ్చి ప్రోత్సహించారు. ఆమె ఉత్తీర్ణత విద్యార్థులకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని, సాధికారత మరియు సామాజిక పురోగతికి సాధనంగా విద్య యొక్క పరివర్తన శక్తిని నొక్కి చెబుతుందని కొనియాడారు.

ఒడిశాకు గర్వకారణం



బిద్యాధర్ మాఝి, కెప్టెన్



భారత్ జట్టు అబ్బాయిలు



భారత్ జట్టు అమ్మాయిలు

భువనేశ్వర్: ఆసియా రగ్బీ ఎమిరేట్స్ కోసం చైనాలో జరగనున్న అండర్-18 రగ్బీ భారత్ జట్టుకు ఒడిశాకు చెందిన బిద్యాధర్ మాఝి కెప్టెన్‌గా నాయకత్వం వహిస్తారు. రాష్ట్రం నుంచి నలుగురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు భారత జట్టులో స్థానం సాధించారు. శామ్యూల్ మైర్స్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నర్సింగ్ మాడ్కమి



కలెక్టర్ కార్యాలయం వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే తదితరులు

మల్కన్‌గిరి: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మాడ్కమి అన్నారు. మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా చైతన్య రథాన్ని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చైతన్య రథం ద్వారా సమితుల్లో ఉన్న 111 పంచాయతీల్లో ఈ నెల పదో తేదీలోగా మొత్తం రెండు లక్షలు మొక్కలు నాటాలని కోరారు. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీన అమ్మకోసం ఒక చెట్టు కార్యక్రమాన్ని నిర్వహించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్, జిల్లా అటవీశాఖ అధికారి డి.ఎన్.కిరణ్‌కుమార్, జిల్లా సబ్ కలెక్టర్ ఎ.ఎల్.అశ్విని, జిల్లా ఎస్పీ వినోద్ పాటిల్ పాల్గొన్నారు.

38 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు అరెస్టు



రాయగడ రైల్వే స్టేషన్ వద్ద పట్టుబడిన నిందితులు



హటోమునిగుడ వద్ద పట్టుబడ్డ నిందితుడు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్, రాయగడ రైల్వే స్టేషన్లలో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అబ్కారీ శాఖ అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి 38.500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాయగడ అబ్కారీ శాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకుని వారిని విచారించగా వారి నుంచి 20.500 కిలోల గంజాయి పట్టు బడింది. ఈ మేరకు అబ్కారీ శాఖ అధికారులు వారిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కర్ణాటకకు చెందిన అజాజ్ పటక్కా, ఎ.నూరుల్లాలు ఉన్నారు. అలాగే జిల్లాలోని బిసంకటక్ పరిధిలోని హటో మునిగుడ రైల్వే స్టేషన్‌లో 18 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న అధికారులు ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కె.కార్తిక్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు.

క్లుప్తంగా

పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

- బీఎస్పీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సరోజ్ నాయక్



రాయగడలో పర్యటిస్తున్న సరోజ్ నాయక్ తదితరులు

రాయగడ: జిల్లాలో బీఎస్పీ పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సరోజ్ నాయక్ అన్నారు. కాసీపూర్‌కు చెందిన ఆయన రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా నియమితులై శనివారం రాయగడలో పర్యటించిన సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా స్థానిక కొత్త బస్టాండు వద్ద గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మున్సిపాలిటీ టౌన్ హాల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న బీఎస్పీని జిల్లాలో మరింత బలోపేతం చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. అందుకు పార్టీ కార్యకర్తలు సహకరించాలని కోరారు. బడుగు వర్గాల హక్కుల కోసం పోరాడటంతో పాటు వారి జీవన స్థితిగతులను మారాలంటే బీఎస్పీకి ప్రజల ఆదరణ ఎంతో అవసరమని అన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు పర్యటించి వారి సమస్యలను తెలుసుకోవాలని అన్నారు.

దుర్గా మిశ్రాకు ఘన స్వాగతం



దుర్గా మిశ్రాకు స్వాగతం పలికిన రబినారాయణ నందో, తదితరులు

జయపురం: జయపురం బీజేడీ యువనేత దుర్గ మిశ్రాకు శనివారం జయపురం విమానాశ్రయంలో ఆ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. రాష్ట్ర బీజేడి అధిస్టానం దుర్గ మిశ్రాను రాష్ట్ర పార్టీ కార్యవర్గ అధ్యక్షుడిగా నియమించింది. మొదటి సారిగా భువనేశ్వర్ నుంచి జయపురం వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతించారు. స్వాగతం పలికిన వారిలో మాజీ మంత్రి, బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రబినారాయణ నందో, సీనియర్ నాయకులు ఉన్నారు.

ప్రతి కార్యకర్తనూ కలుస్తా..

- 2029 సాధారణ ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్.రఘువీరా రెడ్డి



గుమ్మా బ్లాక్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎన్.రఘువీరా రెడ్డి

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మ బ్లాక్‌లోని సెరంగో, గైబ, అజయగడ గ్రామాల్లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్.రఘువీరా రెడ్డి శనివారం పర్యటించారు. పర్లాకిమిడిలో 'సాక్షి'తో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ జతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాలతో ప్రతి జిల్లాకు ఒక సీనియర్ నాయకుడిని పంపించి పార్టీని బలోపేతం చేయాలని ఆదేశించారని అన్నారు. రాహుల్ గాంధీని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానిగా చేసేవరకు విశ్రమించకుండా ప్రతీ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని సమితి కేంద్రాల్లో పర్యటించి అందరి అభిప్రాయాలు తీసుకుంటానన్నారు. అనేక మంది తెలుగు ప్రజలు గజపతి జిల్లాలో ఉన్నారని, గతంలో పి.వి.నరసింహారావు బరంపురం లోక్ సభ స్థానానికి పోటీ చేసి 90 వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన ఘనత ఇక్కడ ఉందన్నారు. డి.సి.సి అధ్యక్షుడు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, పీసీసీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే చిన్మయి బెహరా, రాష్ట్ర కాంగ్రెస్ మహిళా నాయకురాలు నిరుపమా పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల హక్కులను పరిరక్షించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా స్పష్టం చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు భవనంలో జువెనైల్ జస్టిస్ – పిల్లల రక్షణ చట్టాలపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల హక్కుల దుర్వినియోగాన్ని అరికట్టడంలో కుటుంబం, పాఠశాల, సమాజం కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కర రావు, శ్రీకాకుళం కార్యదర్శి కె.హరిబాబు, ప్రిన్సిపాల్ మేజిస్ట్రేట్ (జువెనైల్ జస్టిస్ బోర్డు) కేఎం జమ్రుత్ బేగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ యు.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బై..బై.. గణేశా..



జంఝావతి నదీతీరాన గణనాథుని నిమజ్జనం

రాయగడ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రుల వినాయక ఉత్సవాలను నిమజ్జనం చేశారు. కేసీబీ రోడ్డు సమీపంలో గల వినాయకుడి నిమజ్జనోత్సవంలో యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యగీతాలతో పాల్గొన్నారు. జంఝావతి నదీతీరానికి గణనాథులను తీసుకువెళ్లి నిమజ్జనాలను చేశారు.

– రాయగడ



లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజలందుకున్న గణనాథుని నిమజ్జనోత్సవం



నిమజ్జనోత్సవాల్లో పాల్గొన్న మహిళలు



జంఝావతి నది వద్ద మహిళల సందడి

సంతకాల పరిశీలన



కుంద్ర సమితి బీడీఓ ముందు హాజరైన సర్పంచ్‌లు, సమితి సభ్యులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి పొరజపై సమితి సర్పంచ్‌లు, సమితి సభ్యులు తీసుకువచ్చిన అవిశ్వాస నోటీసుపై పెట్టిన సంతకాలను సమితి బీడీఓ పి.మానస్విత పర్యవేక్షణలో జీపీడీఓ జగత్ సింగ్ మఝి శనివారం పరిశీలించారు. వారిలో ఉభయ సర్పంచ్, సమితి సభ్యుల గల పంచాయతీలు కెరామటి, డొంగొరపంశి, పకనాగుడ, పుప్పుగాం, మొసిగాం, బణువగుడ, దిగాపూర్, ఘుమర, కుంద్ర, లిమ్మ, అసన, తదితర 11 పంచాయతీలలో 22 మంది సర్పంచ్‌లు, సమితి సభ్యులతోపాటు, రాణిగుడ, బాగ్దేరి, గుండాల్, ఫూల్‌భట్ట సమితి సభ్యులు కలిసి 26 మంది పాల్గొని బీడీఓ, జీపీడీఓల సమక్షంలో సంతకాలు చేశారు. వాటిని అధికారులు అవిశ్వాస నోటీసుపై ఉన్న సంతకాలతో పరిశీలించారు. పంచాయతీ సమితిలో గల 16 గ్రామ పంచాయితీల్లోని 32 మంది సమితి సభ్యులు, సర్పంచ్‌లు ఉండగా వారిలో 26 మంది సమితి అధ్యక్షురాలిపై అవిశ్వాసం తెలుపుతూ సంతకాలు చేశారు. ఈ సంతకాలను జయపురం సబ్‌కలెక్టర్‌కు పంపటం జరుగుతుందని, సబ్ కలెక్టర్ నిర్ణయం మేరకు తాము చర్యలు తీసుకుంటామని బీడీఓ వెల్లడించారు. ఇది ఇలా ఉండగా కుంద్ర పంచాయతీ అధ్యక్షునిపై గత 64 ఏళ్ల కాలంలో ఎన్నడూ అవిశ్వాస తీర్మానం రాలేదని, ఇదే ప్రథమమని సమితి ఉపాధ్యక్షులు తరుణి సేన్ బిశాయి వెల్లడించారు. తాము గత నెల 8వ తేదీన జయపురం సబ్‌కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం అందజేశామని, 20న అవిశ్వాస తీర్మానంపై చర్యలు చేపట్టాలని మరోసారి అధికారులకు విజ్ఞప్తి చేశామన్నారు. అప్పటికీ అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవటంతో తామంతా 30న జయపురం సబ్‌కలెక్టర్‌ను కలిసి వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని, తామంతా సామూహిక రాజీనామాలు చేసి న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఎట్టకేలకు సమావేశం ఏర్పాటు చేసి బీడీఓ సంతకాలను సేకరించారని వెల్లడించారు.

సాంకేతిక రంగంలో నైపుణ్యత పెంచుకోవాలి



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

టెక్కలి: మారుతున్న కాలంతో పాటు సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న మార్పుల్లో భాగంగా విద్యార్థులతో పాటు అధ్యాపకులు మరింత నైపుణ్యత పెంచుకోవాలని ప్రముఖ కంప్యూటర్ విభాగం సంస్థ క్వాంటమ్ కంప్యూటింగ్ వైస్ ప్రెసిడెంట్ లక్ష ప్రియదర్శి పేర్కొన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలతో శనివారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో సాంకేతిక రంగంలో అత్యంత ఆధునీకరణ సామర్థ్యం పొందిన తమ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రైవేట్ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఒప్పందం వలన కళాశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల పురోగతికి మేలు జరుగుతుందన్నారు. క్వాంటం టెక్నాలజీలో విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి శిక్షణా కార్యక్రమాలు, సెమినార్లు, సర్టిఫికేషన్ కోర్సులను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొడక్ట్ లీడర్ ఎం.చంద్రమౌళి, కళాశాల డైరక్టర్ వి.వి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టి.నాగరాజు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకుడు బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మఠం భూములు హాంఫట్..!

- బావాజీ మఠం భూముల కబ్జా
- ఆక్రమణదారుల చేతుల్లోకి రూ.కోట్లు విలువైన భూములు
- అక్రమ లే అవుట్లకు అడ్డగోలు అనుమతులు



ఇటీవల కబ్జా చేసిన స్థలం చదును చేసిన దృశ్యం

ఆమదాలవలస రూరల్:

ఆక్రమించుకునే అవకాశమే ఉండాలి గానీ.. ఆకాశాన్ని కూడా వదలరు ఇక్కడి అక్రమార్కులు. వీరి కన్నుపడితే ఎటువంటి భూములైనా మటాష్ కావాల్సిందే. దేవుడి భూములైనా.. ప్రభుత్వ బంజరు భూములైనా అన్యాక్రాంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దర్జాగా దురాక్రమణ చేయడమే కాదు.. అనధికార లే అవుట్లు వేయడంలోనూ ముందుంటారు. మహా నగరాలకు తీసిపోనివిధంగా భవంతుల నిర్మాణాలు చేపడుతున్నారు. ఆమదాలవలస రూరల్ మండలంలో కబ్జారాయుళ్ల దర్జా ఇది. ఇటీవల తోటాడ గ్రామంలో బావాజీ మఠం భూముల ఆక్రమణలే ఇందుకు నిదర్శనం.

ఆగని ఆక్రమణల పర్వం

గత కొంతకాలం నుంచి ఆమదాలవలస మండలం తోటాడ గ్రామంలో ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. అధికారుల కళ్లెదుటే ఈ కబ్జాలు జరుగుతున్నా పట్టించుకునేవారే లేరు. సర్వే నంబర్ 121లో 199.48 ఎకరాల బావాజీ మఠం భూములు దర్జాగా కబ్జా చేశారు. కొందరు కూటమి నాయకుల అండతో అక్కడ భూదందా చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒడిశాకు చెందిన మఠం యజమానులు ఇక్కడ నుంచి వెళ్లిపోవటంతో పాటు వారి వారసులు కూడా ఇక్కడ అందుబాటులో లేరు. దీంతో కబ్జాదారులు ఈ భూములు ఆక్రమించుకొని వ్యాపారం సాగిస్తున్నారు. అలాగే జాతీయ రహదారికి ఆనుకొని కొత్త రోడ్డు వద్ద ఉన్నటువంటి మఠం భూములను సైతం ఆక్రమించారు.



తోటాడ గ్రామంలో బావాజీ మఠం భూముల్లో నిర్మాణాలు

అధికారుల చేతివాటం

ఇకపోతే ఆక్రమణదారుల అక్రమ లేఅవుట్లకు అనుమతులు అందించడంలో అధికారులు చేతివాటం చూపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి ఇక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వాస్తవానికి ఏదైనా లేఅవుట్‌కు అనుమతి పొందాలంటే అందుకు సంబంధించిన భూపత్రాలు ఉండాలి. అయితే ఇతరులు భూములకు సంబంధించి అక్రమ లే అవుట్లకు అనుమతులు మంజూరు చేశారంటే దీని వెనుక ఎంత చేతివాటం ఉందో అన్న విషయం అర్థమవుతోంది.

అక్రమ రిజిస్ట్రేషన్లు

వాస్తవంగా మఠం భూములకు సంబంధించి ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేసే అధికారం లేదు. అయితే సంబంధం లేని సర్వే నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు సహకరిస్తున్నారని పలువురు మాట్లాడుకుంటున్నారు. అలాగే మఠం భూముల్లో వ్యాపార భవనాలు గానీ, అపార్ట్‌మెంట్లు గానీ నిర్మిస్తే విద్యుత్ సదుపాయం అందించకూడదు. కానీ విద్యుత్ శాఖ అధికారులు అధిక మొత్తంలో అక్రమార్జనకు పాల్పడి అడ్డగోలుగా ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు అందించినట్లు తెలుస్తోంది.

జోరందుకుంటున్న నిర్మాణాలు

ఈ స్థలంలో మహా నగరాలను తలపించేవిధంగా అక్రమ నిర్మాణాలు జోరందుకుంటున్నాయి. ఆక్రమణదారులు ఇతరులకు విక్రయించేందుకు కొందరు అపార్ట్‌మెంట్ నిర్మాణ గుత్తేదారులకు ఈ స్థలం అప్పగిస్తున్నారు. అంతేకాకుండా కొనుగోలుదారులకు బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కూడా అందించడం విశేషం. ఏది ఏమైనా వందల ఎకరాల స్థలాన్ని ఆక్రమణదారులు యథేచ్ఛగా దోచుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు రంగ ప్రవేశం చేసి ఈ కబ్జాలకు అడ్డుకట్టు వేయకపోతే మరిన్ని భూములు మాయమవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డైట్ కళాశాలలో గురుపూజోత్సవం



మాట్లాడుతున్న ట్రైనర్ ప్రసాద్ కుమార్ పట్నాయక్

పర్లాకిమిడి: స్థానిక ట్రైనింగ్ స్కూల్ రోడ్డు జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ముర్ము అధ్యక్షత వహించగా.. సీనియర్ అధ్యాపకరాలు మమతా జెన్నా, ప్రశిక్షకులు ప్రసాద్ కుమార్ పట్నాయక్, ఎ.సంధ్యారాణి, సంతోషి దేవి, సోనాలీ రవుతో పాల్గొన్నారు. గురువులను విద్యార్థులు ఎప్పటికీ మరచిపోరాదని, రాబోయే తరం వారికి విద్యార్థులకు మీరు బోధించే సమయం వస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరూ తమ గురుతర బాధ్యత మరువరాదని ప్రిన్సిపాల్ డాక్టర్ ముర్ము అన్నారు. డైట్ విద్యార్థులు ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందజేసి గౌరవించారు. ఐసీటీ. బోధకుడు ధమ్మిరాజ్ పాత్రో ధన్యవాదాలు తెలియజేశారు.



హాజరైన విద్యార్థులు

ఉపాధ్యాయులకు సత్కారం



మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ బినోద్ కుమార్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన నిర్వాహకుడు బినోద్ కుమార్ బిశోయి నేతృత్వంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు కొవ్వొత్తులా కరిగి విద్యార్థుల భవిష్యత్‌కు కోసం వెలుగును ప్రసాదిస్తారన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి గౌరవించారు. అలాగే బహుమతులు అందజేశారు.



ఉపాధ్యాయినికి బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న యూరియా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

- పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో యూరియా కొరత ఏర్పడిందని, నల్ల బజారు తరలింపు వంటి సమస్యలు రైతులు ఎదుర్కొంటున్నారని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. జిల్లా వ్యాప్తంగా యూరియా కొరతతో రైతుల వద్ద నుంచి అనేక వినతులు అందుతున్నాయన్నారు. స్థానిక హైటెక్ ప్లాజాలో ఎమ్మెల్యే శనివారం ఉదయం విలేకర్లతో మాట్లాడారు. జిల్లా వ్యవసాయశాఖ వివరాల మేరకు గజపతి జిల్లాకు 5,081 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 3,816 మెట్రిక్ టన్నుల యూరియా వివిధ వ్యవసాయ పరపతి సొసైటీల ద్వారా సరఫరా చేశారని అన్నారు. ఇంకా 1,256 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు అందాల్సి ఉందన్నారు. గుసాని బుసుకిడి పంచాయతీలో అత్యధికంగా 600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా.. వివిధ సొసైటీల ద్వారా 300 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారన్నారు. కొందరు రైతులు బినామీ రైతు కార్డుల ద్వారా యూరియా కొనుగోలు చేసి పొరుగున ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. రాష్ట్రంలోనే కాదు ప్రతి జిల్లాలో కూడా ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, కేంద్రం యూరియా ప్రొడక్షన్ తగ్గించినందున ఈ సమస్య ఏర్పడుతుందన్నారు. జిల్లాలో యూరియా కొరత, నల్లబజారుకు తరలిపోకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి విన్నవిస్తానని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, గుసాని సమితి అధ్యక్షుడు వీర్రాజు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ్ దాస్ జయంతి



మాట్లాడుతున్న చారుప్రభానాయక్

పర్లాకిమిడి: భాగవతం మన దైనందిన జీవితంలో ఒక భాగమని, వాటిని పండితులు జగన్నాథ దాస్ చక్కగా తన గ్రంథంలో వివరించారని శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల ప్రొఫెసర్ చారుప్రభా నాయక్ అన్నారు. స్థానిక సరస్వతి శిశు విద్యామందిర్‌లో అఖిల భారత సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో జగన్నాథ దాస్ జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ చారుప్రభా నాయక్, గౌరవ అతిథులుగా పూర్ణచంద్ర మహాపాత్రో, విశ్రాంత ఉపాధ్యాయిని ఆశాలత పాణిగ్రాహి, మహిళా కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కల్యాణి మిశ్రా, ప్రధాన ఆచార్యులు సరోజ్ పండా మాట్లాడారు. 1966లో అఖిల భారత సాహిత్య పరిషత్ న్యూ ఢిల్లీలో స్థాపించబడిందన్నారు.



సభకు విచ్చేసిన విద్యార్థులు, అధ్యాపకులు

• తక్షణమే ఐఆర్ ప్రకటించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఐఆర్‌ను ప్రకటించాలని ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కె.ప్రవల్లికా ప్రియ అన్నారు. ఏపీ జేఏసీ మహిళా విభాగం ఏర్పాటై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం శ్రీకాకుళంలోని రెవెన్యూ వసతి గృహం సమావేశ మందిరంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చైల్డ్ కేర్ లీవ్‌లు కేంద్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలు ఇస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేవలం ఆరు నెలలు మాత్రమే ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రెండేళ్ల పాటు సెలవు ఇవ్వాలని కోరారు. అలాగే తమకు రావాల్సిన నాలుగు డీఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల పే స్లిప్పులు సకాలంలో వచ్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. సమావేశంలో ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ కె.శ్రీరాములు, ఏపీ జేఏసీ కార్యదర్శి వెంకట రమణ, జి.అరుణకుమారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యాన్ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు



బోల్తాపడిన వ్యాన్

వేపాడ: మండలకేంద్రం వేపాడ సమీపంలో కల్లాల్లో పంచదారతో వెళ్తున్న వ్యాన్ శనివారం బోల్తా పడడంతో డ్రైవర్ గాయాలపాలయ్యాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోడవరం నుంచి ఆనందపురం వేపాడ మీదుగా ఎస్.కోటకు పంచదారతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి వేపాడ కళ్లాలవద్ద రోడ్డుపై బోల్తాపడింది. దీంతో డ్రైవర్ కృష్ణకు గాయాలు కాగా స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి హెచ్‌సి శేషాద్రి, కానిస్టేబుల్ కిషోర్ 108 వాహనంలో తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డెంగీతో వివాహిత మృతి

భోగాపురం: మండలంలోని చిన కవులవాడ (యాతపేట) గ్రామానికి చెందిన వివాహిత మైనపు మంగ (28) డెంగీ వ్యాధి సోకి శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న మంగను కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి డెంగీ వ్యాధి సోకి మెదడుకు వ్యాపించిదని నిర్ధారించారు. ఇంతలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంగ పిచ్చి పిచ్చి పేలాపనలు, వాగడం మొదలు పెట్టింది. దీంతో వ్యాధి తీవ్రం కావడంతో ఆస్పత్రిలో కొన్ని రోజులు ఉంచి వైద్యం అందించాలని వెద్యులు సూచించినప్పటికీ కుటంబసభ్యులు వినకుండా ఆమెకు దెయ్యం పట్టిందనే అనుమానంతో ఇంటికి తీసుకువచ్చేశారు. దీంతో ఆమెకు వైద్యం అందక చనిపోయింది. మృతురాలికి భర్త నరసింహులుతో పాటు ఇద్దరు కూమార్తెలు ఉన్నారు.

గూడ్స్ ఢీకొని వ్యక్తి మృతి

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట గ్రామం సమీపంలో కొత్తవలస-కిరండోల్ (కేకే లైన్) రైల్వే ట్రాక్ దాటుతుండగా మార్లాపల్లి గ్రామానికి చెందిన గేదెల దేముడుబాబు (48) గూడ్స్ ఢీకొట్టడంతో శనివారం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేముడుబాబు సంతపేట గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు రైల్వే ట్రాక్ దాటి వెళ్తుండగా కిరండోల్ నుంచి విశాఖ వెళ్తున్న గూడ్స్ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో రెండు కాళ్లు తెగిపడ్డాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి కొన ఊపిరితో ఉన్న దేముడు బాబును ఎస్‌కోట సీహెచ్‌సీకి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసునమోదు చేశారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



మధు (ఫైల్)

బొబ్బిలి: మండలంలోని కృష్ణాపురం గ్రామంలోని రైతు కూలీ కుటుంబానికి చెందిన బలగ మధు(23)అనే యువకుడు బొబ్బిలి సమీపంలోని గున్నతోటవలస సమీపంలోని రైలు కింద పడి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై రైల్వే పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన బలగ శంకరరావుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మధుసూదన రావు ట్రిపుల్ ఐటీ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. చిన్న కుమారుడు ఐటీఐ చదువుతున్నాడు. మధు చేస్తున్న ఉద్యోగ ప్రయత్నాలు కలిసి రాక పోవడంతో తరచూ కలత చెందేవాడు. ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని చెబుతున్నారు. ఉద్యోగం రాకపోతే పోయింది. మా శక్తి ఉన్నంత వరకూ పెంచుతాం. తరువాత ఎప్పుడైనా ఉద్యోగం రాకపోతుందా?మమ్మల్ని అప్పుడు పెంచుతావుకదా? ఇంత ఘోరానికి ఒడిగట్టావా నాయనా అంటూ తల్లిదండ్రులు మృత దేహంపై పడి రోదిస్తున్న తీరు స్థానికులను కలిచివేసింది. మధు మృతి వార్తతో కృష్ణాపురంలో విషాద ఛాయలు అముకున్నాయి. మృతదేహాన్ని బొబ్బిలి ఆస్పత్రికి తరలించిన రైల్వే పోలీసులు పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ క్రమంలో రాష్ట్రంలో యువత అందరికీ ఉద్యోగాలు కల్పిస్తాం లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని పట్టించుకోకపోవడంతో యువత ఆత్మహత్యల బాట పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పోక్సో చట్టంపై అవగాహన

గురుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో శనివారం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి ఎస్.దామోదరరావు పాల్గొని, పోక్సోచట్టంతో పాటు గుడ్,బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులంతా ఒకరిపై మరొకరు అజమాయిషీ చెలాయించకూడదని, అందరూ సమానమేనన్న భావనతో మెలగాలని తెలిపారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, ఎస్‌ఐ ఫక్రుద్దీన్, ప్రిన్సిపాల్ రజని తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా బాల్య వివాహాలు..!

- ఈఏడాది 23 నిలుపుదల
- గ్రామాల్లో కానరాని నిషేధ కమిటీ సమావేశాలు
- అనధికారికంగా అధిక సంఖ్యలో జరిగిపోతున్నట్లు ఆరోపణలు

మండలాల వారీగా బాల్యవివాహాల నిలుపుదల

మండలం	నిలిపివేసిన బాల్య వివాహాలు
డెంకాడ	1
మెరకముడిదాం	1
గజపతినగరం	1
బొండపల్లి	1
గరివిడి	1
జామి	1
విజయనగరం	13
రేగిడిఆముదాలవలస	1
రాజాం	1
సంతకవిటి	2



బాల్యవివాహాల నిషేధ చట్టం వాల్ పోస్టర్

విజయనగరం ఫోర్ట్: ఈఏడాది జనవరి నెలలో బొండపల్లి మండలంలో 16 ఏళ్ల బాలికకు వివాహం చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. ఈ విషయాన్ని చైల్డ్‌లైన్ ట్రోల్‌ఫ్రీ నంబర్ 1098కు ఓ వ్యక్తి సమాచారం అందించాడు. దీంతో చైల్డ్‌లైన్, బాలల సంరక్షణ, పోలీసులు సంబంధిత గ్రామానికి వెళ్లి బాల్య వివాహాన్ని నిలుపుదల చేశారు.

అలాగే విజయనగరం మండలంలో 17 ఏళ్ల బాలికకు వివాహం చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. ఈవిషయాన్ని చైల్డ్ లైన్ ట్రోల్‌ఫ్రీ నంబర్ 1098కు ఓ వ్యక్తి ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీంతో అధికారులు సంబంధిత గ్రామానికి వెళ్లి బాల్య వివాహాన్ని నిలుపుదల చేశారు. ఈ రెండు చోట్లే కాదు. జిల్లాలో అనేక చోట్ల బాల్య వివాహాలు గుట్టుగా జరిగిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల దృష్టికి వచ్చినవి చాలా తక్కువే. అధికారుల దృష్టికి రాకుండా రహస్యంగా బాల్యవివాహాలు జరిగిపోతున్నట్లు సమాచారం. బాల్య వివాహాలకు అధికారులు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సమావేశం కాని కమిటీలు

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో బాల్యవివాహ నిషేధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి పంచాయతీ సర్పంచ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో బాల్య వివాహాల నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. అయితే ఈ కమిటీ సమావేశాలు ఎక్కడా కానరావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాల్యవివాహం చేయడానికి అస్కారం ఉండే వారిని వీరు గుర్తించి వారిపై దృష్టి సారించాల్సి ఉంటుంది. అనాథ బాలికలు, ఇంట్లో వృద్ధాప్యం బారిన పడిన తాతయ్యలు, మామ్మలు ఉండేచోట బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి చోట్ల బాల్య వివాహాలు చేయకుండా వారికి అవగాహన కల్పించాలి. కాని ఎక్కడా ఈ చర్యలు కానరావడం లేదు.

10 మండలాల్లో ప్రయత్నాలు

జిల్లాలోని 10 మండలాల్లో బాల్యవివాహాలు చేయడానికి బాలికల తల్లిదండ్రులు ప్రయత్నించారు. ఈ 10 మండలాల్లో జనవరి నెల నుంచి ఇప్పటివరకు అధికారులు 23 చోట్ల బాల్య వివాహాలను నిలుపుదల చేశారు.

నిలిపివేస్తామని చెప్పి వివాహాలు

అధికారుల సమక్షంలో బాల్య వివాహాన్ని నిలుపుదల చేసినట్లు ఇరువైపులా తల్లిదండ్రులు చెబుతున్నారు. లఖిత పూర్వకంగా రాసి ఇస్తున్నారు. అంతటితోనే అధికారులు ఆగిపోతున్నారు. తర్వాత వారు నిజంగానే బాల్య వివాహలు నిలుపుదల చేశారా? లేదా ఎక్కడైనా వివాహం చేసేశారా అని ఫాలోఅప్ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వల్ల అధికారుల ముందు బాల్య వివాహం నిలుపుదల చేసిన తల్లిదండ్రులు మళ్లీ వివాహం జరిపించేస్తున్నారు.

రెండేళ్ల జైలు

బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలు చేసిన, ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేసి రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంది. ఒక్కోసారి జైలు, జరిమానా విడివిడిగా పడే అవకాశం ఉంది.

బాల్య వివాహాల నిరోధంపై దృష్టి



బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో బాల్య వివాహ నిషేధ కమిటీ సమావేశాలు నెలలో రెండుసార్లు నిర్వహించాలి. ఆ విధంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

టి.విమలారాణి,
జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

రాణికట్ వ్యాధితోనే లక్షలాది కోళ్ల మృతి

- పశువర్ధకశాఖ ఎ.డి కన్నంనాయుడు



రామలింగాపురం సమీపంలో ఖాళీ అయిన పౌల్ట్రీఫామ్



రామలింగాపురం గ్రామం సమీపంలో ఒక పౌల్ట్రీలో చనిపోయిన కోళ్లను గొయ్యి తీసి పాతిపెడుతున్న దృశ్యం

కొత్తవలస: ఇటీవల కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో అంతుచిక్కని వ్యాధితో లక్షలాది కోళ్లు మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా కోళ్లు రాణికట్ వ్యాధితోనే చనిపోతున్నాయని ఈ మేరకు విజయవాడ సెంట్రల్ లేబొరేటరీ నుంచి నివేదికలు అందాయని పశువర్ధకశాఖ కొత్తవలస ఎ.డి కన్నంనాయుడు శనివారం తెలిపారు. కోళ్ల మృతికి బర్డ్‌ఫ్లూ కారణం కావని నిర్ధారణ జరిగినట్లు చెప్పారు. లక్షలాది కోళ్ల మృతికి కారణం రాణికట్ వ్యాధే కారణమని స్పష్టం చేశారు. దీనివల్ల ప్రజారోగ్యానికి ఎటువంటి ముప్పులేదన్నారు. కాగా మరోపక్క కోళ్ల మృతులు మాత్రం ఆగడం లేదు. పౌల్ట్రీ కోళ్ల కన్నా దేశవాళీ కోళ్లే అధిక సంఖ్యలో మృతి చెందుతున్నాయి. లక్షలాది కోళ్ల మృతికి కారణం బర్డ్‌ఫ్లూ కారణమని ప్రభుత్వం ప్రకటిస్తే రైతులకు నష్టపరిహారం ఇవ్వాల్సి వస్తుందని, అందుకే ఆ వ్యాధిగా ప్రభుత్వం ప్రకటించ లేదని కొంతమంది పౌల్ట్రీ రైతులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. గడిచిన 20 రోజులుగా కోళ్లు మృతిచెందినా అధికారులు పట్టించుకోక ప్రస్తుతం కొత్తరకం రాణికట్ ఆనే వ్యాధిని తెరపైకి తెచ్చారని రైతులు ఆరోపిస్తున్నారు. పక్క రాష్ట్రమైన ఒడిశా రాష్ట్రంలో ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ వ్యాధి ఉందని ఆ వైరసే మన పౌల్ట్రీలకు సోకిందని రైతులు వాపోతున్నారు. మరోపక్క కోళ్ల మృతులు ఆగక పోవడంతో పదుల సంఖ్యలో పౌల్ట్రీలు ఖాళీ అవుతున్నాయి. రైతుల ఆరోపణపై ఎ.డి కన్నంనాయుడిని వివరణ కోరగా లేబొరేటరీలో పరీక్షల అనంతరం రాణికట్ వ్యాధిగా నిర్ధారణ అయిందన్నారు. రైతుల ఆరోపణలో వాస్తవం లేదన్నారు. వైరస్ తగ్గు ముఖం పట్టిన వెంటనే వ్యాక్సిన్ వేస్తామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్



విజేతలకు జ్ఞాపికలు అందిస్తున్న నిర్వాహకులు

రాజాం: స్థానిక జీఎంఆర్ వరలక్ష్మి డీఏవీ స్కూల్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. జీఎంఆర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జె.గిరీష్, సీఏఓ సుప్రియోభట్టాచార్య తదితరులు ఈ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ప్రారంభించి పర్యవేక్షించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి 22 డీఏవీ పాఠశాలలకు చెందిన 561 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వారిలో విజేతలకు పాఠశాల ఆవరణలో జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్‌ఐటీ స్టూడెంట్స్ ఫెడరేషన్ డీన్ రాంబాబు, జీసీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. పురుషోత్తమరావు, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుల పూర్తి కలేనా?



జిల్లా కేంద్రం ప్రారంభంలో డైవర్షన్ పనుల దశలో నిలిచిపోయిన అంతర్‌రాష్ట్ర రహదారిపై కల్వర్టు



శిథిలావస్థకు చేరిన లక్ష్మీనారాయణపురం సమీపంలో కల్వర్టు



గుంతలతో అధ్వానంగా పులిగుమ్మి రహదారి

- జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన 44 కల్వర్టులు
- రెండింటికి మాత్రమే మంజూరైన నిధులు

పార్వతీపురం రూరల్: రహదారులపై అధ్వానంగా భారీ గుంతలు ఏర్పడి వాహన చోదకులను ప్రమాదాలకు గురిచేస్తుంటే ఇంకోపక్క రహదారిపై ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరి, కుంగిపోయి మరింత భయాందోళనకు వాహనచోదకులను గురిచేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా రహదారులపై 44 కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. వాటి నిర్మాణాల నిమిత్తం ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు, అంచనా విలువలు అధికారులు పంపించారు. అయితే ప్రస్తుతం రెండు కల్వర్టులకు సంబంధించి మాత్రమే నిధులు మాత్రమే మంజూరయ్యాయని, మరో 133 కల్వర్టులకు మరమ్మతులు చేసేందుకు కూడా నివేదికలు పంపామని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే రహదారులు దారుణంగా గోతులమయమై వాహనాల రాకపోకలకు తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రహదారుల్లో కనీస స్థాయిలో మరమ్మతులు సైతం సక్రమంగా నిర్వహించడం లేదు. జిల్లా కేంద్రం నుంచి కొరాపుట్‌కు వెళ్లేందుకు ఉన్న రహదారిపై మరమ్మతులు ప్రారంభించి కొన్ని భారీ గుంతలు మాత్రమే పూడ్చి పనులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రహదారిపై అక్కడక్కడ ఏర్పడిన గుంతల్లో రాళ్లు తేలి మరమ్మతులకు నోచుకోకపోవడంతో సమస్యకు పూర్తి పరిష్కారం కాలేదని వాహన చోదకులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల నిర్మాణం ఎప్పుడో?

రహదారి నిర్మాణం, మరమ్మతులకు సంబంధించిన 97పనులకు నిధులు మంజూరు కాగా 324 కిలోమీటర్ల రహదారి పనులను ప్రారంభించి 295 కిలోమీటర్లు పనులు పూర్తిచేశామని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. అయితే జిల్లాలో ఇప్పటికీ దారుణమైన గుంతలతో రహదారులు దర్శనమిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 324 కిలోమీటర్ల పరిధిలో పనులు చేశామని ఆర్అండ్‌బీ పరిధిలో మరో 150 కిలోమీటర్ల రోడ్ల పనులకు నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇంకా చాలా ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన రహదారుల పనులపై ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో స్పష్టత ఇవ్వడం లేదు. అంచనాలు వేస్తున్నామంటూ దాటవేస్తున్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో బైపాస్‌రోడ్డు, పార్వతీపురం మండలంలోని పులిగుమ్మి, లక్ష్మీనారాయణపురం, సంగంవలస, సీతంపేట తదితర గ్రామాల రోడ్లు గుంతలతో నేటికీ అధ్వానంగా ఉన్నాయి. మరి ఈ రోడ్డు పనులు ఎప్పుడు నిర్వహిస్తారో? ప్రభుత్వం నిధులు మంజూరు చేసేదెప్పుడో? అర్థం కాని పరిస్థితి నెలకొంది. జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు రోజూ కళ్లారా చూస్తూ దారుణమైన పరిస్థితుల్లో ఉన్న రహదారులపై ముఖం చాటేస్తూ దాటేస్తున్నారు. ఈ నేపథ్యంలో సామాన్య వాహన చోదకులు అధికారులు, పాలకుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నివేదికలు సిద్ధం చేస్తున్నాం

ఆర్అండ్‌బీ పరిధిలో గత అక్టోబర్‌లో మంజూరైన నిధుల మేరకు 324 కిలోమీటర్ల రహదారి పనులు ప్రారంభించి 295 కిలోమీటర్ల పనులు పూర్తి చేశాం. అలాగే కల్వర్టులకు సంబంధించి 44చోట్ల పునర్నిర్మాణాల కోసం, 133 కల్వర్టుల మరమ్మతులకు సంబంధించి అంచనాలతో కూడిన నివేదికలను పంపించాం. అయితే రెండు కల్వర్టుల పునర్నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరయ్యాయి. మిగతా వాటికి మంజూరు కావాల్సి ఉంది. రహదారులపై అవసరమైన చోట తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నాం.

రాధాకృష్ణ, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్
పార్వతీపురం, మన్యం జిల్లా

రజక మహిళ హత్యపై ఆగ్రహం

- కలెక్టరేట్ ఎదుట రజక సంఘాల ధర్నా



వినతిపత్రాన్ని అందుకుంటున్న డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం కొత్తవలస గ్రామంలో ఇటీవల రజక మహిళ హత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని రజక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐక్యవేదిక సభ్యులు శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ నెల 4న గ్రామంలో పెత్తందారులు రజకులపై దాడి చేసి అరసవిల్లి హరమ్మ అనే మహిళను దారుణంగా హతమార్చి, మరో ఐదుగురిని తీవ్రంగా గాయపరిచారన్నారు. రజకుల రక్షణ కోసం ప్రభుత్వం వెంటనే ప్రత్యేక భద్రతా చట్టాన్ని రూపొందించాలని, బాధిత కుటుంబాలకు తగిన నష్ట పరిహారం చెల్లించాలని గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రజక సమాఖ్య అధ్యక్షుడు గురజాపు సత్యారావు, ఆంధ్రప్రదేశ్ రజక సేవా సంఘం అధ్యక్షుడు కెల్లా సత్యం, మద్ది పైడిరాజు, తామాడ అచ్చన్న, కొత్తకోట భవాని, ముత్యాల సత్యవతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దుష్ట సంప్రదాయానికి పరాకాష్ట

- జెడ్పీచైర్మన్ ఫ్లెక్సీలు చించివేసిన దుండగులపై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బొబ్బిలి: పట్టణంలో కొత్త దుర్మార్గానికి తెరతీశారు గుర్తు తెలియని దుండగులు. ఇటీవల జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా బొబ్బిలి పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. వాటిని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు బ్లేడ్, చాకుతో కోసినట్టు చించేశారు. అభిమానంగా పెట్టుకున్న ఫ్లెక్సీలకు కూడా రాజకీయ దుర్బుద్ధితో ఇలా చించడం సరికాదంటూ చూసిన వారు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఇదే సంప్రదాయం కొనసాగించే అవకాశం ఉందని దీనిని కొనసాగించకుండా అడ్డుకోవాలని ఆలోచించిన వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు ఎస్ రామకృష్ణ, పాలవలస ఉమా శంకర్, ఇంటి గోవిందరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి దుండగులను గుర్తించాలని, కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీఐని కోరారు.

బాలల చట్టాల అమలులో సమస్యలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత

విజయనగరం లీగల్: రాష్ట్రంలో బాలల న్యాయ, బాలల పరిరక్షణ చట్టాల అమలులో ప్రధాన సమస్యలున్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షురా ఎం. బబిత అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో బాలల న్యాయ, బాలల పరిరక్షణ చట్టాల అమలులో ప్రధాన సమస్యలు అనే అంశంపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షురాలు, ప్రధాన న్యాయమూర్తి ఎంబబిత పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా నిధుల కొరత, అవగాహన లేకపోవడం, సిబ్బంది కొరత, ప్రత్యేక పోలీస్ యూనిట్ల లోపం ,శిక్షణ పొందిన మానవ వనరుల కొరత, సతి గృహాల కొరత వంటివి ప్రధాన సమస్యలుగా, సవాళ్లుగా ఉన్నాయన్నారు. మొదటి సమస్య నిధుల కొరత అని, బాలల పరిరక్షణ కార్యక్రమాలకు, వసతి గృహాల నిర్వహణకు అవసరమైన నిధుల కొరత ఉందన్నారు. అదేవిధంగా చట్టాలు ప్రభుత్వ పథకాలు, బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన తక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో స్పెషల్స్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థల ఇన్‌చార్జ్ కార్యదర్శి లక్ష్మీకుమారి, మహిళా పోలీస్ స్టేషన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్ గోవిందరావు బాలలకు సంబంధించిన స్వచ్ఛంద సంస్థలు, జోనల్ జస్టిస్ బోర్డు ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు



ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ద్విచక్ర వాహనదారులపై చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందల్ శనివారం అన్నారు. నిబంధనలు అతిక్రమించిన ద్విచక్ర వాహన దారులపై 955 కేసులు నమోదు చేసి, రూ.4,77,460/లను జరిమానా విధించామన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద వాహన తనిఖీలు చేపట్టి ద్విచక్ర వాహనాలను ప్రమాదకరంగా నడిపిన వాహన దారులపై 88 కేసులు నమోదు చేశామని తెలిపారు. హెల్మెట్స్ ధరించని వారిపై 155 కేసులు, మైనర్లు డ్రైవ్ చేస్తున్న వారిపై 8 కేసులు, లైసెన్స్ లేని వాహన చోదలకుపై 471 కేసులు నమోదు చేశామని చెప్పారు. ఇక భద్రత నియమాలు ఉల్లంఘించిన వారిపై 46 కేసులు, నంబర్ ప్లేట్స్ సక్రమంగా లేని వారిపై187 కేసులు నమోదు చేశామన్నారు. స్పెషల్ డ్రైవ్ లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని బ్లాక్ స్పాట్స్ వద్ద వాహన తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు రోడ్ సేఫ్టీ నిబంధనల గురించి, హెల్మెట్ ధరించకుండా వాహనం నడపడం వల్ల జరిగే అనర్థాలను వివరించి, కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. వాహనదారుతో పాటు బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. ప్రతి వాహన దారు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, సురక్షితంగా గమ్య స్థానాలు చేరుకోవాలని హితవు పలికారు. ప్రత్యేక డ్రైవ్‌ను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించారన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



రిక్షాను పక్కకు తీసేందుకు సాయం చేస్తున్న స్థానికులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద ఓ మహిళ పసిపాపతో రిక్షాలో వెళ్తున్న క్రమంలో రిక్షాను వెనకనుంచి లారీ ఢీకొట్టడంతో రిక్షా చక్రం రహదారిపై ఉన్న గుంతలో ఒక్కసారిగా దిగిపోయింది. దీంతో రిక్షా ఒక్కసారిగా పక్కకు వాలిపోవడంతో రిక్షాలో ఉన్న మహిళ, పసిపాప రోడ్డుపై పడి తేలికపాటి గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో రిక్షాకు ఉన్న చక్రం గుంతలో దిగి ధ్వంసమైంది. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులంతా భావించారు.

నేత్రదానం చేయండి

- జిల్లా ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణుడు డా.వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న నేత్ర వైద్య నిపుణుడు డా.వెంకటేష్

పార్వతీపురం టౌన్: నేత్రదానం చేసి చూపు లేని వారికి వెలుగునివ్వండని జిల్లా ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణుడు డా. వెంకటేష్ కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా ఆస్పత్రిలోని నేత్ర వైద్య విభాగంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్నియల్ అంధత్వంతో చూపు కోల్పోయిన వారికి నేత్ర దాతల నుంచి సేకరించిన కార్నియా మార్పిడి ద్వారా కంటి చూపును ప్రసాదించవచ్చున్నారు. కావున ప్రజలందరూ అవగాహన చేసుకుని నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. వ్యక్తి మరణానంతరం ఆరు గంటల్లోగా నేత్రాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా సెప్టెంబరు 8 వరకు నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాల్లో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా నేత్రాలను సేకరించేందుకు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేత్ర వైద్యాధికారి కృష్ణారావు, జిల్లా ఎన్‌జీఓ అధ్యక్షుడు కిశోర్, శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్‌తో స్ప్రేపై అవగాహన



నారాయణపురంలో డ్రోన్‌తో స్ప్రే చేస్తున్న అధికారులు, సిబ్బంది

బలిజిపేట: నానో యూరియా, డీఏపీలను డ్రోన్‌తో స్ప్రే చేసే విధానంపై మండలంలోని నారాయణపురంలో రైతులకు శనివారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయశాఖ ఏఓ శివగణేష్ ఆధ్వర్యంలో నారాయణపురంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇఫ్కో కంపెనీ వారి సారథ్యంలో నానో యూరియా, డీఏపీలను ఇద్దరు రైతులకు చెందిన భూములలో డ్రోన్‌తో స్ప్రే చేయించారు. ఏఓ శివగణేష్ రైతులతో మాట్లాడుతూ యూరియా వినియోగాన్ని తగ్గించాలని, మోతాదుకు మించి యూరియా వినియోగించడం వల్ల భూసారం తగ్గుతుందని తెలిపారు. అందుకు ప్రత్యామ్నాయంగా డ్రోన్‌తో స్ప్రే చేయించడం వల్ల రైతులకు సమయం , డబ్బు ఆదా అవుతుందని, మందు పొలమంతా స్ప్రే అయి పంటకు మేలు జరుగుతుందన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.